భూమిపుత్రుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, రచయిత గోసుల శ్రీనివాస్ యాదవ్, పార్టీ నేతలు

యుద్ధం మిగిలే ఉంది

- త్వరలో కవులు, ఉద్యమకారులతో సమావేశం
- 'భూమిపుత్రుడు' పుస్తకావిష్కరణలో కేసీఆర్

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో యుద్ధం ఇంకా మిగిలే ఉన్నదని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మరో ఉద్యమానికి నడుం బిగించాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. ఉద్యమ శక్తులను మరోసారి పునరేకీకరించి కార్యక్షేత్రానికి రూపకల్పన చేస్తున్నట్టు చెప్పారు. రాజకీయ, సామాజిక అంశాల్లో వచ్చిన మార్పులు, రాష్ట్ర ప్రగతి తదితర అంశాలపై వివిధ పత్రికల్లో వచ్చిన వ్యాసాలతో ఉద్యమకారుడు గోసుల శ్రీనివాస్ యాదవ్ రూపకల్పన చేసిన 'సన్ ఆఫ్ ద సాయిల్' (భూమిపుత్రుడు) పుస్తకాన్ని శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోసుల శ్రీనివాస్‌యాదవ్‌ను అభినందించారు. తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని, రాష్ట్ర ప్రగతిని సాధారణ శైలిలో ప్రజలకు అర్థమయ్యేలా వివరించారని ప్రశంసించారు. కవులు, కళాకారులు ఏకం కావలసిన అవసరాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. ఉద్యమ రచయితలతో త్వరలో సమావేశాన్ని నిర్వహించుకుందామని, రచయితలకు అన్ని విధాలుగా తోడుగా ఉంటామని అన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ సర్కారు తిరోగమన దిశలో నడిపిస్తున్నదని, అది తప్పుడు మార్గమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో కర్షకులు, కార్మికులు, నిరుద్యోగు సహా వివిధ వర్గాలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ సీనియర్ నేత గ్యాదరి బాలమల్లు, శరత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డి రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధినేత కేసీఆర్

ఎన్నికలపై కార్తీక్‌రెడ్డి పుస్తకం

- కేసీఆర్ చేతుమీదుగా ఆవిష్కరణ

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకుడు పీ కార్తీక్‌రెడ్డి రాసిన 'హౌ టు బయ్ యాన్ ఇండియన్ ఎలక్షన్' పుస్తకాన్ని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శుక్రవారం ఆవిష్కరించారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత ఎన్నికల ప్రక్రియలో పార్టీలు, ఓటర్ల పాత్ర తదితర అంశాలతో ఈ పుస్తకాన్ని రాశారు. గతంలో జరిగిన ఎన్నికలకు, ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలకు మధ్య ఉన్న తేడాలు, వర్తమాన రాజకీయాలు, సవాళ్లతోపాటు ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలన్న అంశాలను ఈ పుస్తకంలో పొందుపర్చారు.

'ధరణి' రీఫండ్‌కు ముప్పుతిప్పలు

- నాలుగైదు నెలల నుంచే ఆప్షన్
- వివరాలు చెప్పని అధికారులు
- స్లాట్ రద్దయితే తిరిగిరాని డబ్బు
- ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌లో స్లాట్ రద్దు చేసుకున్న తర్వాత డబ్బులు రీఫండ్ చేయకుండా అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారని రైతులు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రీఫండ్ ఆప్షన్ నాలుగైదు నెలల కిందటే అందుబాటులోకి వచ్చినా తమకేం తెలియదని కిందిస్థాయి అధికారులు బుకాయిస్తున్నారని వాపోతున్నారు. వ్యవసాయ భూముల క్రయవిక్రయాల కోసం ధరణి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకునే సమయంలోనే స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చార్జీలు, ఇతర ఫీజులు కలిపి చెల్లించాల్సి ఉంటుంది. ఏదైనా కారణంతో కొనుగోలు నిలిచిపోయి స్లాట్‌ను రద్దు చేసుకుంటే ఫీజు కింద కట్టిన డబ్బును తిరిగి రైతు ఖాతాకు బదిలీ చేయాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది ధరణిలో పలు కొత్త ఆప్షన్లు తేవాలని నిర్ణయించింది. కొన్ని అందుబాటులోకి రాగా ఎన్నికల నేపథ్యంలో మరికొన్ని రాలేదు. ఎన్నికల కోడ్ ఎత్తేశాక ధరణిలో కొత్త ఆప్షన్లు చేరాయి. ఇందులో 'రీఫండ్ ఆప్షన్' కూడా ఉందని, నాలుగైదు నెలల కిందే కలెక్టర్ లాగిన్‌లో ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. స్లాట్ రద్దు చేసుకున్నవారు కలెక్టర్‌కు దరఖాస్తు చేస్తే 'రీఫండ్' ప్రొసీడింగ్స్' ఇవ్వాలి. ఆ తర్వాత దరఖాస్తు సీసీఎల్ఏ కార్యాలయ అనుమతితో జిల్లాలోని ట్రెజరీకి వెళ్తుందని, పరిశీలన పూర్తయ్యాక రైతు ఖాతాలో డబ్బు జమవుతుందని చెబుతున్నారు. కానీ, ఈ ఆప్షన్ వివరాలను అటు ప్రభుత్వం, ఇటు అధికారులు బహిర్గతం చేయడం లేదు. అసలు ఈ సదుపాయం ఉందనే విషయం చాలా జిల్లాల్లో కింది స్థాయి రెవెన్యూ అధికారులకే తెలియదంటే ఎంత గుట్టుగా ఉంచుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ అధికారుల నోటి నుంచి 'కట్టిన డబ్బు వెనక్కి వచ్చే ఆప్షన్ లేదు. ఎప్పుడు వస్తుందో తెలియదు' అనే సమాధానమే వస్తున్నది. ఫలితంగా రైతులు ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణ చేస్తూనే ఉన్నారు.

'మాకు సంబంధం లేదు'..

రీఫండ్ కోసం మండల కార్యాలయానికి వెళ్తే 'కలెక్టర్ ఆఫీస్‌లో అడగండి' అటూ పంపేస్తున్నారని రైతులు, చిన్నచిన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. చిన్న మొత్తంలో కట్టినవారు కొందరు కలెక్టరేట్ల చుట్టూ తిరగలేక 'వచ్చినప్పుడు తీసుకుందాం' అని సర్దుకుపోతున్నారు. ఇక రూ.లక్షల్లో కట్టినవారు మాత్రం అటు భూమి రాక, ఇటు కట్టిన డబ్బు రాక, వాటికి మిత్తి కట్టలేక నానాతిప్పలు పడుతున్నారు. కొందరు సీసీఎల్ఏ కార్యాలయానికి వెళ్లాక 'కలెక్టర్ల దగ్గరే రీఫండ్ ఆప్షన్ వచ్చింది. అక్కడికే వెళ్లి అడగండి' అంటూ సమాధానం వస్తుండటంతో బిక్కమొహం వేస్తున్నారు. తిరిగి కలెక్టర్ కార్యాలయాలనికి వెళ్లిన తర్వాత వారికి అసలు సినిమా మొదలవుతున్నదని చెబుతున్నారు. ఈ– డిస్ట్రిక్ట్ మేనేజర్లు, జిల్లా ధరణి కో ఆర్డినేటర్లు, ట్రెజరీ అధికారులు, రెవెన్యూ విభాగం, రిజిస్ట్రేషన్ విభాగం ఇలా ఒక్కో ఆఫీసు చుట్టూ తిప్పుతున్నారని, ఎక్కడికి వెళ్లినా 'మాకు సంబంధం లేదు' అనే సమాధానమే చెప్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.51లక్షల ఫీజు కోసం కాళ్లరిగేలా..

కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలానికి చెందిన రైతు రూ.1.51 లక్షలు చెల్లించి నాలుగెకరాల కొనుగోలు కోసం స్లాట్ బుక్ చేసుకున్నాడు. తర్వాత స్లాట్ రద్దు చేసుకొని రీఫండ్ కోసం మండల, జిల్లా కార్యాలయాల్లో సంప్రదించగా ప్రస్తుతం ఆ ఆప్షనే లేదని సమాధానం వచ్చింది. సీసీఎల్ఏ కార్యాలయంలో సంప్రదించగా కలెక్టర్ లాగిన్‌లో మాడ్యూల్ ఎప్పుడో అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లగా 'రీఫండ్ ప్రొసీడింగ్స్' ఇచ్చి ట్రెజరీలో ఇవ్వాలని సూచించారు. అక్కడికి వెళితే జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ విభాగంలో సంప్రదించాలని ఉచిత సలహా ఇచ్చారు. అక్కడా 'మాకేం సంబంధం లేదు' అనే సమాధానమే ఎదురైంది. దీంతో బాధితుడు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అకౌంట్స్ విభాగం దరఖాస్తును స్వీకరించింది. అప్పటి నుంచి ఆఫీసుకు వెళ్లినప్పుడల్లా 'మీ దరఖాస్తు ప్రాసెస్‌లో ఉంది' అని చెప్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రీఫండ్ ఆప్షన్‌పై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

బీఆర్ఎస్‌కు ధోకా లేదు

- విజయశాంతి

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో బీఆర్ఎస్ ఉండదంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్‌నేత విజయశాంతి అన్నారు. దక్షిణాదిలో ప్రాంతీయ పార్టీలకు ధోకాలేదని శుక్రవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కరుణానిధి, ఎంజీఆర్, ఎన్టీఆర్, రామకృష్ణ హెగ్డే, జయలలిత నుంచి బీఆర్ఎస్, వైసీపీకి వస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. దక్షిణాది ప్రజల ఆస్తిత్వాన్ని బీజేపీ అర్థం చేసుకోలేదని కిషన్‌రెడ్డి రుజువు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాపాలన తెస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం పన్నుల పాలన తెచ్చిందని మండిపడ్డారు. ఆర్థికభారం మోపాలని చూస్తే ప్రజలకు అండగా నిలబడి పోరాడుతామని హెచ్చరించారు. పంటలకు ఇస్తామన్న రూ.500 బోనస్‌కు షరతులు పెడితే రైతులు కాంగ్రెస్‌ను బొందపెడతారని హెచ్చరించారు. సన్నవడ్లకే కాకుండా ప్రతి ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నాడు అలా.. నేడు ఇలా..

కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన అంశాలన్నింటినీ ప్రస్తుతం అమలు చేయాలని చూస్తున్నదని దేవీప్రసాద్ ఆరోపించారు. కేసీఆర్ హయంలో భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగాయని గగ్గోలు పెట్టిన రేవంత్‌రెడ్డి, ఇపుడు ప్రజలపై రిజిస్ట్రేషన్ చార్జీల భారం మోపబోతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ భూములు అమ్మొద్దంటూ నాడు నీతులు చెప్పి, నేడు భారీగా భూముల అమ్మకానికి తెరలేపబోతున్నారని ఆరోపించారు. పన్నుల ఆదాయం భారీగా పెరిగిందని గణాంకాలు చెప్తున్నా, ప్రజలపై మరిన్ని భారాలు మోపే విధంగా ముఖ్యమంత్రి ఆలోచించడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో విమర్శిస్తున్న వారిపై అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ నేత చిరుమళ్ల రాకేశ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పక్కనపెట్టిన రేవంత్‌రెడ్డి.. ప్రజలపై పన్నులు ఏవిధంగా వేయాలనే విషయాలపై సమీక్ష చేస్తున్నారని విమర్శించారు. రైతుల దగ్గర ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లపై లాఠీలా?

సర్కారు 'మందు' చూపు

మొదటిపేజీ తరువాయి...

ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ పాలనలో సంపద గణనీయంగా పెరిగింది. పదేండ్లలో జరిగిన అభివృద్ధితో తలసరి ఆదాయం రెట్టింపయ్యింది. కేసీఆర్ ప్రభుత్వం గుడుంబా తయారీ, అమ్మకాలపై ఉక్కుపాదం మోపింది. ఫలితంగా కల్తీసారా మరణాలు ఆగిపోయాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో మద్యం అమ్మకాలు ఏటికేడు పెరిగాయని, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఎవరినీ ప్రోత్సహించలేదని విశ్లేషకులు చెప్తున్నారు. కానీ, మీడియాలోని ఒక వర్గం ఈ పరిణామాలను కప్పిపుచ్చి మద్యం అమ్మకాలను బూతద్దంలో పెట్టి చూపించిందని, కాంగ్రెస్, ఇతర పార్టీల నేతలు ఇదే ప్రచారం చేస్తూ ప్రజల్లోకి తప్పుడు భావనను తీసుకెళ్లారన్నారు.

మద్యం అమ్మకాలే ఆధారం

తాము అధికారంలోకి వస్తే, మద్యం అమ్మకాలను నియంత్రిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు మద్యం అమ్మకాలపై వచ్చే నిధులపైనే ఆధారపడిందనే విమర్శలొస్తున్నాయి. అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేసేందుకు నిధుల వేటలో పడింది. వాణిజ్యపన్ను తర్వాత అత్యధికంగా డబ్బులు కురిపించే కల్పతరువుగా ఎక్సైజ్‌శాఖను గుర్తించింది. ఈ నేపథ్యంలోనే మద్యం అమ్మకాలను పెంచి, ఆదాయం దండుకోవాలని ప్రణాళిక రచించినట్టు సమాచారం. లిక్కర్, బీరు, వ్యాట్, ఇతర లైసెన్స్‌ల ఫీజుల నుంచి ఎక్సైజ్ శాఖకు ప్రతినెలా దాదాపు రూ.మూడు వేల కోట్ల ఆదాయం వస్తుంది. మద్యం, ఇతర వ్యాట్‌లు కలుపుకొని ఎక్సైజ్ శాఖకు 2022లో రూ.32 వేల కోట్లు, 2023లో రూ.35 వేల కోట్లు ఆదాయం వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని ఏకంగా రూ.45 వేల కోట్లకు పెంచినట్టు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే రూ.902.28 కోట్ల బీర్లు అమ్మారు. 2023 ఏప్రిల్‌లో అమ్మింది రూ.764 కోట్లు మాత్రమే. నిరుటికంటే ఈసారి 19శాతం బీర్ల అమ్మకాలు పెంచారు. అన్ని డిపోల్లో ఒక్క ఏప్రిల్ నెలకు 2.28 లక్షల కేసుల బీర్లను నిల్వ ఉంచారు. దీనిని బట్టే మద్యం అమ్మకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏ స్థాయిలో ఆధారపడిందో అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు చెప్తున్నారు. 'తెలంగాణను తాగుబోతు రాష్ట్రంగా చేశారు' అంటూ విమర్శలు గుప్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడెందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

బెల్ట్‌షాపులపై చర్యలేవి?

రాష్ట్రంలో 60 వేలకుపైగా బెల్ట్‌షాపులున్నాయని, తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగా రద్దు చేస్తామని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే 2023 నవంబర్ 17న విడుదల చేసిన అభయహస్తం మ్యానిఫెస్టోలో సైతం ఇదే అంశాన్ని చేర్చారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా కనీస చర్యలు లేవు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు పెరిగాయని ప్రజలు ఆందోళన బాటపడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం పల్సి, కోసాయి గ్రామాల్లో బెల్ట్‌షాపులపై మహిళలు దాడులు చేసి, మద్యాన్ని ధ్వంసం చేశారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లోనూ ఇలాంటి పరిస్థితే కనిపిస్తున్నది.

ఇప్పుడు నోరు మెదపరేం?

ఎక్సైజ్ ఆదాయం పెరగాలన్న ప్రభుత్వ ఆదేశం మేరకు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు రోజూ మద్యం అమ్మకాలపై సమీక్షలు చేస్తున్నారు. మద్యం ఉత్పత్తి పెంచి ఎక్కడా 'నో స్టాక్' బోర్డులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిస్టలరీ, బ్రూవరీలకు అంతర్గతంగా ఆదేశాలిస్తున్నారు. కిందిస్థాయి సిబ్బందికి పైస్థాయి అధికారులు టార్గెట్‌లు ఇచ్చినట్టు సమాచారం. ప్రస్తుతం ప్రతినెల 30 లక్షల కేస్‌లకుపైగా మద్యం అమ్మకాలు జరుగుతుండగా, దీనిని మరింత పెంచే ప్రయత్నాల్లో అధికారులు ఉన్నారు. నాడు బెల్ట్, మద్యం అమ్మకాలపై గగ్గోలు పెట్టిన ఒక వర్గం మీడియా ఇప్పుడు స్పందించకపోవడం గమనార్హం. సోషల్ మీడియా సైతం మౌనం దాల్చింది.

ఆదాయం పెంచాలి: ఎక్సైజ్‌శాఖ కమిషనర్

రాష్ట్ర ఆదాయాన్ని పెంచాలని ఆబ్కారీ కమిషనర్ శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఆబ్కారీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్లు, డీసీలు, డీఈపీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాటుసారాను మూడు నెలల్లో తుదముట్టించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో చాలా ప్రాంతాల్లో ఎన్డీపీఎల్ వచ్చిందని, తద్వారా ఎక్సైజ్‌శాఖ ఆదాయం తగ్గుతున్నదని, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘాపెట్టి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లిక్కర్‌ను అరికట్టాలని చెప్పారు. వేసవిలో బీరు స్టాక్ లేదనే వార్తలు వస్తున్నాయని, రికార్డుల ప్రకారం పరిశీలిస్తే గత ఏడాది కంటే ఎక్కువగానే బీరు నిల్వలు ఉన్నన్నాయనిచెప్పారు. నాటుసారా తయారీని తుదముట్టించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి చెప్పారు. ఆగస్టునాటికి పూర్తిగా గుడుంబాను నిర్మూలించడానికి ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.

పంచాయతీలకు నిధులేవి?

మొదటిపేజీ తరువాయి...

ఆదర్శంగా తీర్చిదిద్దాలని, నూతన పంచాయతీరాజ్ చట్టం తీసుకొచ్చి, ప్రతి గ్రామానికి ఒక పంచాయతీ కార్యదర్శిని నియమించింది కేసీఆర్ ప్రభుత్వం. గ్రామానికి ట్రాక్టర్, రోడ్ల వెంబడి మొక్కలు నాటడం, చెత్తను సేకరించటం, డంపింగ్ షెడ్ నిర్మాణం చేపట్టారు. కేంద్ర నిధులతో సమానంగా నిధులను విడుదల చేయడంతో అనేక పంచాయతీలు జాతీయస్థాయి అవార్డు సాధించాయి. జనరల్ ఫండ్ నిధులను కరెంటు బిల్లులకు చెల్లించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తేవడంతో వాటికే ఆ నిధులు సరిపోతున్నాయని స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి నిర్వహణ బాధ్యత పంచాయతీలదే అని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడంతో గత 2, 3 నెలలుగా పంచాయతీలు తాగునీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. వాటి నిర్వహణ ఖర్చులకూ తమ జేబుల్లో నుంచి పెట్టాల్సి వస్తున్నదని కార్యదర్శులు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయటం లేదని తెలిపారు. గ్రామాల్లో సమస్యలు వచ్చి పరిష్కారం కాకపోతే తమకు మెమోలను జారీ చేస్తున్నారని, కానీ నిధుల గురించి మాత్రం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీకి ఉన్న ట్రాక్టర్‌లో డీజిల్ పోయటానికీ డబ్బులు లేని దుస్థితి నెలకొన్నదని, గ్రామాల్లో చెత్త ఎత్తిపోయటానికి కష్టం అవుతున్నదని వెల్లడించారు. తమ పరిస్థితి కక్కలేక మింగలేక అన్నట్టు తయారైందని పేర్కొంటున్నారు.

రాజన్నసిరిసిల్ల జిల్లా కోళ్లమద్ది జీపీకి తాళంవేసి నిరసన తెలుపుతున్న తాజామాజీ సర్పంచ్ కేశవరావు

బిల్లులు రాలేదని పంచాయతీకి తాళం

- అధికారుల తీరుపై మాజీ సర్పంచ్ నిరసన

గంభీరావుపేట, మే 17: చేసిన పనులకు బిల్లులు రాలేదని తాజా మాజీ సర్పంచ్ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసనకు దిగాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోళ్లమద్ది తాజా మాజీ సర్పంచ్ కేశవరావు రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, రూ. 8 లక్షలతో అభివృద్ధి పనులు చేశాడు. బిల్లులు రాకపోవడంతో శుక్రవారం జీపీకి తాళం వేసి నిరసన తెలిపాడు. తనకు రావాల్సిన రూ. 28 లక్షల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశాడు.